# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 53 వ భాగం

### దక్ష ప్రజాపతి – 2

### ఈశ్వర దక్షుల విరోధం

ఇంతకు ముందు వ్యాసంలో దక్షుడు తన కూతుర్లకి పెళ్ళి చేయడం, వాళ్లకి నర నారాయణులు పుట్టడం అవీ చూసాం. అసలు మహా భాగవతం శుకుడు పరీక్షిత్తుకి చెప్పడం ఎలా ప్రారంభం అవుతుందో చూద్దాం. యుద్ధం అయిపోయాక, శ్రీకృష్ణ నిర్యాణం విని విదురుడు అనేకానేక తీర్థాలు సేవించుకుంటూ మైత్రేయ మహర్షి దగ్గిరకి చేరతాడు. ఆయన ఒక్కో విషయం చెప్తూ ఈ కథంతా విదురురుడి చెప్తాడు. ఇదంతా వ్యాసుడు రాసి శుక మహర్షికీ మిగతావాళ్లకీ చెప్పాక అది జనావళికి తెలుస్తుంది – శుకుడు పరీక్షిత్తుకి చెప్పినట్టూ. అందువల్ల ఒక్కో చోట విదురుడు మైత్రేయుణ్ణి అడిగినట్టూ వస్తూ ఉండడం ఈ భాగవతంలో చూస్తాం.

సీ. దక్షప్రజాపతి తనయ యా భవుని భా;
రయయు ననఁ దగు సతి యను లతాంగి
సతతంబుఁ బతిభక్తి సలుపు చుండియుఁ దనూ;
జాతలాభము నందఁ జాలదయ్యె;
భర్గుని దెసఁ జాలఁ బ్రతికూలుఁ డైనట్టి;
తమ తండ్రిమీఁది రోషమునఁ జేసి
వలనేది తా ముగ్ధవలె నిజయోగ మా;
ర్గంబున నాత్మదేహంబు విడిచె;" [4-35]

తే. నని మునీంద్రుఁడు వినిపింప నమ్మహాత్ముఁ
డైన విదురుండు మనమున నద్భుతంబు
గదురఁ దత్కథ విన వేడ్క గడలుకొనఁగ
మునివరేణ్యునిఁ జూచి యిట్లనియె మఱియు. [4-35.1]

సరే, దక్షుడు తన కూతురు సతీదేవిని శివుడికిచ్చాడు కదా? పరమశివుని భార్య అయిన సతీదేవికి సంతానం కలగలేదు. ఉత్తరోత్తరా దక్షుడు ఏదో కారణానికి పరమేశ్వరునిమీద పగబూనడంతో తన తండ్రిమీద కోపం వచ్చి ఆ ఉత్తమ ఇల్లాలు యోగమార్గంలో తన శరీరాన్ని విడిచేసింది; అని మైత్రేయుడు విదురునితో చెప్పాడు. విదురుడు ఆశ్చర్యపడి ఆ వృత్తాంతమంతా తెలుసుకోవాలనే కుతూహలంతో ఆ మునీంద్రుని ఇలా అడుగుతున్నాడు.

సీ. "చతురాత్మ! దుహితృవత్సలుఁడైన దక్షుండు;
దన కూఁతు సతి ననాదరము చేసి
యనయంబు నఖిలచరాచర గురుఁడు ని;
ర్వైరుండు శాంతవిగ్రహుఁడు ఘనుఁడు
జగముల కెల్లను జర్చింప దేవుండు;
నంచితాత్మారాముఁ డలఘుమూర్తి
శీలవంతులలోన శ్రేష్ఠుండు నగునట్టి;
భవునందు విద్వేషపడుట కేమి [4-36]

తే. కారణము? సతి దా నేమి కారణమున
విడువరానట్టి ప్రాణముల్ విడిచె? మఱియు
శ్వశుర జామాతృ విద్వేష సరణి నాకుఁ
దెలియ నానతి యిమ్ము సుధీవిధేయ!" [4-36.1]

మైత్రేయుడిలా అనేసరికి విదురుడు అడుగుతున్నాడు, అలా కూతుర్ని అనాదరంతో చూడడానికీ, అఖిల చరాచరాలకి గురువూ, శత్రువులులేని వాడూ (నిర్వైరుండు), శాంత స్వభావుడూ, శీలవంతులలో శ్రేష్ఠుడూ అయిన శివుని మీద దక్షుడు ద్వేషం ఎందుకు పెంచుకున్నాడు? పోనీ ఏదోలా పెంచుకున్నా సతీదేవి అలా ప్రాణం విడవడానికి ఏమిటి కారణం? అదీకాక మామ (శ్వశుర) దక్షుడుకి శివుడు అల్లుడు (జామాతృ) కదా? ఇదంతా ఎలా మొదలైంది?

క. అని యడిగిన నవ్విదురునిఁ
గనుఁగొని మైత్రేయుఁ డనియెఁ గౌతుక మొప్పన్
"విను మనఘ! తొల్లి బ్రహ్మలు
జన నుతముగఁ జేయునట్టి సత్రముఁ జూడన్. [4-37]

దీనికి మైత్రేయుడిలా చెప్తున్నాడు. మొదట్లో ఒకనాడు బ్రహ్మ విదులు చేసే యజ్ఞాన్ని చూడాడానికి అందరూ వెళ్ళారు. ఇక్కడ సత్రము అంటే యజ్ఞము అని అర్థం కదా?

చ. సరసిజగర్భ యోగిజన శర్వ సుపర్వ మునీంద్ర హవ్యభు
క్పరమ ఋషిప్రజాపతులు భక్తిఁ మెయిం జనుదెంచి యుండ న
త్తరణిసమాన తేజుఁడగు దక్షుఁడు వచ్చినఁ దత్సదస్యు లా
దరమున లేచి; రప్పుడు పితామహ భర్గులు దక్క నందఱున్. [4-38]

జరిగే యజ్ఞం చూడడానికి అగ్నిహోత్రుడు, ఋషులు, ప్రజాపతులు, మునులూ, శివుడు (శర్వుడు) అందరూ విచ్చేసారు. వాళ్లతోపాటు సూర్యతేజస్సుతో వెలిగే దక్షుడు (తరణి – సూర్య, సమాన తేజుఁడగు దక్షుఁడు) కూడా వచాడు. అలా వచ్చిన దక్షుణ్ణి చూసి బ్రహ్మ మహేశ్వరులు తప్ప (పితామహ భర్గులు దక్క) అందరూ లేచి నుంచుని గౌరవం చూపించారు. ఈ పద్యంలో అగ్నిహోత్రుడనే పదం ఎక్కడుందో చెప్పగలరా? హవ్యభుక్ – యజ్ఞంలో వేల్చేసే హవ్యాలని భుజించేవాడు – అగ్నిహోత్రుడు.

క. చనుదెంచిన యా దక్షుఁడు
వనజజునకు మ్రొక్కి భక్తివశులై సభ్యుల్
తన కిచ్చిన పూజలు గై
కొని యర్హాసనమునందుఁ గూర్చుండి తగన్. [4-39]

అలా వచ్చిన దక్షుడు, బ్రహ్మకి (వనజజుడు – పద్మంలో పుట్టినవాడు) నమస్కారం చేసి తనకు చూపించిన ఆసనం మీద కూర్చుని తనకిచ్చిన అర్ఘ్యపాదాలు (పూజలు) తీసుకున్నాడు.

తే. తన్నుఁ బొడగని సభ్యు లందఱును లేవ
నాసనము దిగనట్టి పురారివలను
గన్నుఁ గొనలను విస్ఫులింగములు సెదరఁ
జూచి యిట్లను రోషవిస్ఫురణ మెఱయ. [4-40]

అయితే తనని చూసి అందరూ గౌరవించారు కానీ అల్లుడు అయిన శివుడు (పురారి) కూర్చున్నవాడు లేచి మామగారైన తనకి సరైన గౌరవం ఇవ్వలేదు అని అనుకుని కంట్లో అగ్నికణాలు కురుస్తూండగా ఇలా అన్నాడు అందరితో.

తే. "వినుఁడు మీరలు రౌదమాని విబుధ ముని హు
తాశనాది సురోత్తములార! మోహ
మత్సరోక్తులు గావు నా మాట" లనుచు
వారి కందఱ కా పురవైరిఁ జూపి. [4-41]

వినండయ్యా, ఇదంతా నేను కోపంతో, మదంతో, మాత్సర్యంతో చెప్తున్నాను అనుకోకండి. మీరంతా చూసారు కదా, ఈ శివుడు (పురవైరి – త్రిపురాసులని కూల్చినవాడు కదా?) నాకు అల్లుడు. అయినా సరే మీరందరూ లేచి నుంచుని గౌరవం ఇచ్చినట్టు నాకు ఏమీ గౌరవం ఇవ్వలేదు.

సీ. "పరికింప నితఁడు దిక్పాలయశోహాని;
కరుఁ డీ క్రియాశూన్యపరుని చేతఁ
గరమొప్ప సజ్జనాచరితమార్గము దూషి;
తం బయ్యె; నెన్న గతత్రపుండు
మహితసావిత్రీ సమానను సాధ్వి న;

స్మత్తనూజను మృగశాబనేత్ర
సకల భూమీసుర జన సమక్షమున మ;
ర్కటలోచనుఁడు కరగ్రహణ మర్థిఁ [4-42]

తే. జేసి తా శిష్యభావంబుఁ జెందు టాత్మఁ
దలఁచి ప్రత్యుద్గమాభివందనము లెలమి
నడపకుండిన మాననీ; నన్నుఁ గన్న
నోరిమాటకుఁ దన కేమి గోరువోయె. [4-42.1]

చూడబోతే ఈ శివుడు దిక్పాలకుల కీర్తికి హాని చేసేవాడు. ఏ పనీ చేతగాని క్రియాశూన్యుడు, సిగ్గులేనివాడు (గత త్రపుండు), ఎగుడు దిగుడు కన్నులు కలవాడు (మర్కటలోచనుండు). ఇతని వల్ల సత్పురుషులు నడిచేమార్గం పాడైపోయింది (సజ్జనాచరితమార్గము దూషితం బయ్యె). అయినా నేను సావిత్రితో సమానమైన నా కూతురు, లేడి కన్నులు కల సతీదేవిని ఇతనికి ఇచ్చాను. ఇంతా చేస్తే నన్ను చూసి కూర్చున్నవాడు లేవకపోతే పోనీయండి, అసలు నోరు విప్పి పలకరించాడా?

దక్షుడు అన్న మాటలు వింటూంటే అసలు ఎవరికైనా అహంకారం ఇంత పని చేస్తుందా అని ఆశ్చర్యం వేయక మానదు. ఆసలు శివుడెటువంటివాడంటే ఆయనున్న దిక్కులోకి బ్రహ్మ హత్యాపాతకం కూడా ప్రవేశించలేదు. ఈ విషయం మనకి భాగవతంలో మరో చోట తగుల్తుంది (ఇంద్ర-వృత్రాసుర సంహారంలో). అటువంటి పరమేశ్వరుణ్ణి ఇక్కడ అన్నీ మర్చిపోయి ఏమంటున్నాడు దక్షుడు? దిక్పాల యశోహాని. ఇదే గర్వం వల్ల చేసే మహాపరాధం అంటే. ఇటువంటివాటికి విరుగుడు అహంకారం పోవడమే. మరి అదంత సులభం కాదు కనక కథ ఇంకా ముదిరి పాకం లో పడుతోంది. ఇదంతా అసలు దేనివల్ల వచ్చిందో ఆలోచిస్తే ఇంత చిన్న విషయానికి అంత కోపం దేనికీ అనిపించదూ?

సీ. అనయంబు లుప్తక్రియాకలాపుఁడు మాన;
హీనుఁడు మర్యాదలేని వాఁడు
మత్తప్రచారుఁ డున్మత్తప్రియుఁడు దిగం;
బరుఁడు భూతప్రేత పరివృతుండు
దామస ప్రమథ భూతములకు నాథుండు;
భూతిలిప్తుం డస్థిభూషణుండు
నష్టశౌచుండు నున్మదనాథుఁడును దుష్ట;
హృదయుఁ డుగ్రుఁడును బరేతభూ ని [4-43]

తే. కేతనుఁడు వితతస్రస్తకేశుఁ డశుచి
యయిన యితనికి శివనాముఁ డను ప్రవాద
మెటులు గలిగె? నశివుఁ డగు నితని నెఱిఁగి
యెఱిఁగి వేదంబు శూద్రున కిచ్చినటులు. [4-43.1]

కోపం చల్లారలేదేమో, ఇంకా చెప్తున్నాడు, “ఈ శివుడు మానహీనుడు, మర్యాద అంటే తెలియనివాడు, దిగంబరుడు, ఉన్మత్తుడై తిరిగేవాడు, భూతప్రేతాలతో తిరిగేవాడు, తామసులైన ప్రమథ నాధుడు, అస్థికలు మెడలో వేసుకుని తిరిగే బూడిదపూసుకుని (భూతి లిప్తుండు) తిరిగేవాడు, శుచిత్వం అంటే తెలియనివాడు (నష్టశౌచుండు), కఠినమైన హృదయం కలిగినవాడు, శ్మశానంలో ఉండే ఇతనికి అసలు శివుడు (మంగళకరుడు) అనే పేరెలా వచ్చిందసలు? వేదాలని శూద్రులకిచ్చినట్టూ, నా కూతురుని విధి ప్రేరేపించడం వల్ల ఇతనికి ఇచ్చాను.”

దక్షుడు శివుణ్ణి ఇలా దూషించడం చూస్తే ఎవరైనా సరే “శివ, శివా” అని చెవులు మూసుకుంటారని అనిపిస్తుంది. తర్వాత కథ వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS